# పారిశుద్ధ్యం నిధులు గుటకాయ స్వాహా

## – నెలకు రూ.లక్షకు పైగా కైంకర్యం –డీజిల్ కొనుగోళ్ళలో అక్రమాలు

## బల్దియాలో యథేచ్ఛగా కుంభకోణం

**(మొదటిపేజీ తరువాయి)** వాస్తవానికి ఒక్కో ట్రాక్టర్‌తో రెండు పర్యాయాలు మాత్రమే చెత్తను తీసుకెళ్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.కొన్ని ట్రాక్టర్లను ఉపయోగించకున్నప్పటికి ఉపయోగిస్తున్నట్లు రికార్డులకు మాత్రమే పరిమితం చేస్తూ కార్పొరేషన్ నిధులను సానిటేషన్ అధికారులు కైంకర్యం చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కో పర్యాయం నగరం నుంచి డంపు యార్డుకు చెత్తను తీసుకెళ్ళేందుకు 5 లీటర్ల చొప్పున ఒక్కో ట్రాక్టర్‌కు మూడు పర్యాయాలకుగాను ప్రతినిత్యం 15 లీటర్ల డీజిల్‌ను కేటాయిస్తారు. మొత్తం 26 ట్రాక్టర్లకు గాను రోజుకు 390 లీటర్ల డీజిల్‌ను వినియోగిస్తున్నట్లు రికార్డులుచెబుతున్నాయి. ఇదిలా ఉంటే వాస్తవంగా ఒక్కో ట్రాక్టర్‌తో కేవలం రెండు పర్యాయాలు మాత్రమే చెత్తను తరలిస్తుండటంతో మరో పర్యాయం డీజిల్‌ను కాజేస్తున్నట్లు తెలిసింది. ఒక ట్రాక్టర్‌కు ఒక ట్రిపుకు 5 లీటర్ల చొప్పున మొత్తం 26 ట్రాక్టర్లకు గాను 130 లీటర్ల డీజిల్‌ను వినియోగించకుండానే బిల్లులు పెడుతూ బల్దియా ఆదాయానికి గండికొడుతూ జేబులుకుంటున్నట్లు తెలిసింది. ఈ విధంగా రోజుకు 130 లీటర్ల చొప్పున నెలకు 3900 లీటర్ల డీజిల్‌ను వినియోగించకుండానే ఆ డబ్బులను మాత్రం పంచుకొని భోంచేస్తున్నట్లు గతంలో కూడా ఆరోపణలు వచ్చాయి. టిఆర్ఎస్ కార్పొరేటర్ సర్దార్ రవీందర్‌సింగ్ డీజిల్ కుంభకోణాన్ని సాక్షాలతో సహా బయటపెట్టడంతో కొద్దిరోజులు అవినీతికి బ్రేక్ వేసి తిరిగి డీజిల్ మింగడం కొనసాగిస్తున్నట్లు తెలిసింది. ఇదే కాకుండా 26 ట్రాక్టర్లలో చెడిపోయిన వాహనాలు కూడా తిరిగినట్లు డీజిల్ కాజేయడమేకాకుండా కొన్ని రోజులు కొన్ని ట్రాక్టర్లను అసలు వినియోగించకుండా డీజిల్ మాత్రం 26 ట్రాక్టర్లు రోజుకు మూడు పర్యాయాలుచెత్తను తీసుకెళ్తున్నట్లు మొత్తం 390 లీటర్ల డీజిల్‌ను వినియోగిస్తున్నట్లు బిల్లులు పెడుతున్నారు. ఈ విధంగా డీజిల్ కొనుగోళ్ళలో అక్రమాలకు పాల్పడుతూ నెలకు రూ.లక్షకు పైగా స్వాహాచేస్తూ ఏడాదికి 15 లక్షల మేరకు బల్దియా ఖజానాకు గండికొడుతున్నట్లు తెలిసింది. సానిటేషన్ విభాగంలో డీజిల్ కొనుగోళ్ళలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపితే మరిన్ని అవినీతి అక్రమాలు కూడా వెలుగుచూసే అవకాశమున్నందున జిల్లా కలెక్టర్ వీటిపై విచారణ జరిపించాలని నగరవాసులు కోరుతున్నారు.

# బీడీ కట్టల గుర్తులపై కార్మికుల ఆందోళన

**(మొదటిపేజీ తరువాయి)** గత ఏడాది కూడా కేంద్ర ప్రభుత్వం బీడీ కట్టలపై శవం గుర్తును ప్రతిపాదించింది. ప్రధానంగా కార్మిక సంఘాలు ప్రతిఘటించాయి. దీనితో తాత్కాలికంగా ప్రతిపాదనను విరమించుకున్నారు. అయితే ఎన్నికల తర్వాత కేంద్రప్రభుత్వం మళ్లీ బీడీ కట్టలపై గుర్తులు ముద్రించాల్సిందిగా జి.ఓను జారీ చేసింది. దీంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈసమయంలో 'మూలిగే నక్కపై తాటికాయ పడిన' చందాన తయారైందని ఆందోళన చెందుతున్నారు. ఈవిధానం వల్ల బహుళజాతి కంపెనీలకు లబ్ధి చేకూరే విధంగా మాత్రమే ఉందని కార్మిక సంఘాల ఆరోపణ. లక్షలాది బీడీ కార్మికులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని వివిధ పార్టీల నాయకులు భావిస్తున్నారు. జిల్లాలో మెట్‌పల్లి,సిరిసిల్ల,వేములవాడ,తదితర ప్రాంతాల్లో వందల కుటుంబాలు బీడీ తయారుతో జీవనం సాగిస్తున్నారు. బీడీ కార్మికులను నష్టపరిచేవిధంగా ఉన్న ఈ జి.ఓపై కార్మికులు,కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ప్రభుత్వం కార్మికుల జీవన భృత్తిని దెబ్బతీసే విధంగా ఉందనే వ్యాఖ్యానాలు విపక్షాల్లో కూడా వ్యక్తం అవుతోంది. బీడీ కార్మికులకు ప్రత్యామ్నయ ఉపాధి అవకాశాలు పెంచాల్సిన అవసరం ఉంది. బీడీ తయారు చేసే వారు వివిధ వ్యాధులకు గురవుతున్నారు. వీరి సంక్షేమాన్ని విస్మరించి అనవసరంగా వీరికి వచ్చే ఆదాయనికి గండిపడే విధంగా కేంద్రప్రభత్వం నిర్ణయం తీసుకుందనే వాదన తెలంగాణా జిల్లాల్లో నెలకొన్నది. ఏదిఏమైనా సుమారు రెండు లక్షల మంది బీడీ కార్మికులకు నష్టం కలగకుండా ప్రభుత్వం పరిశీలించాల్సి ఉంది.ఆదివారం నుంచి అమల్లోకి వచ్చిన బీడీ కట్టలపై గుర్తుల ముద్రణపై సర్వత్రా నిరసన వ్యక్తం అవుతోంది.



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న ఎఐటియుసి బీడీ కార్మికులు

# 'ట్రినిటి' విద్యార్థుల విజయకేతనం

(ప్రభాతవార్త-కరీంనగర్)

ఈ సందర్భంగా ట్రినిటీ విద్యాసంస్థల సంస్థ అధినేత దాసరి మనోహర్‌రెడ్డి అత్యధిక మార్కులు సాధించి కళాశాల కీర్తిని ఇనుమడింపజేసిన విద్యార్థినీ, విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులను అభినందించారు. భవిష్యతులో ఇంకా మెరుగైన ఫలితాలను అందిస్తూ విద్యార్థులకు ఉజ్వలమైన భవిష్యతు కలిగించేందుకు ట్రినిటీ తనవంతు కృషిచేస్తుందని చెప్పారు. అనంతరం ఇంజనీరింగ్‌లో అత్యధిక మార్కులు సాధించిన తొడుపునూరి స్రవంతిని కళాశాల ప్రిన్సిపాల్స్ రాజశేఖర్‌రెడ్డి, రమణారెడ్డి, టి.వెంకటేశ్వర్‌రావు, వెంకట్‌రెడ్డిలు సన్మానించారు.

### కార్డియాలజిస్టుగా సేవలందిస్తా : జీ.వీణ

ఎంబిబిఎస్‌లో చేరి కార్డియాలజీని ప్రత్యేక సబ్జెక్టుగా ఎంచుకొని కార్డియాలజిస్టుగా సేవలందిస్తా. ఇంటర్‌లో 950 మార్కులు సాధించాను. ఎంసెట్‌లో 125 నుంచి 128 వరకు మార్కులు వస్తాయని భావించినప్పటికి 123 మాత్రమే వచ్చాయి. అయినా సంతోషంగానే ఉంది. తల్లిదండ్రుల సహకారం, కళాశాల యాజమాన్యం, లెక్చరర్ల సలహాలు, సూచనలతో అధిక మార్కులు సాధించాను.

### ఇంజనీర్‌ను అవుతా : తొడుపునూరి స్రవంతి

ఎంసెట్‌లో 128 వరకు మార్కులు వస్తాయని భావించా. 126 వచ్చినా సంతోషంగానే ఉంది. ఇసి కోర్సులో చేరి ఇంజనీర్‌గా ప్రజలకు సేవచేస్తా. ఇంటర్మీడియట్‌లో 977 మార్కులు, ఎంసెట్‌లో 126 మార్కులు రావడానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం, కళాశాల యాజమాన్యం, లెక్చరర్ల సహకారం ఎంతో ఉందని, వారికి స్రవంతి కృతజ్ఞతలు తెలిపారు.

# హృద్రోగ రోగ నిర్ధారణ పరికరాలు ప్రారంభించిన డైరెక్టర్

గోదావరిఖని, జూన్ 1, ప్రభాతవార్త

సింగరేణి కార్మికుల సౌకర్యార్థం గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రిలో సోమవారం సంస్థ డైరెక్టర్(పిఅండ్‌పి) డిఎల్ఆర్ ప్రసాద్ హృద్రోగ రోగ నిర్ధారణ పరికరాలను ప్రారంభించారు. సింగరేణి ఉద్యోగులకు శారీరక శ్రమతో పనిచేయ వలసి ఉంటున్నందున ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, అనారోగ్యాల పాలైన వారు తగిన వైద్యం చేయించుకోవడంలో నిర్ల క్ష్యాన్ని వహించకూడదని అన్నారు. కార్మికులకు మెరుగైన వైద్యం అందించడానికియాజమాన్యంఎల్లప్పుడు ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జి-1 సీజిఎం మనోహరరావు, ఆర్‌జి-2,3 జిఎంలు జి.రాజేందర్‌రెడ్డి, నర్సింహారావు, జిఎం(క్వాలిటీ) శ్రీరాములు, జిఎం(సేఫ్టీ) వసంత్‌కుమార్, డిజిఎం రంగప్రసాదరావు, గుర్తింపు సంఘం నేత వై.గట్టయ్య పాల్గొన్నారు.

## మంచి పనులు చేసిన వారినే

# విజయం వరిస్తుంది

## ఉన్నత విద్యాశాఖ మంత్రి శ్రీధర్‌బాబు



గజమాలను వేస్తున్న నాయకులు



పాల్గొన్న ప్రజలు

మంథని , జూన్ 1, ప్రభాతవార్త

సోమవారం రాత్రి స్థానిక గాంధీచౌక్‌లో ఏర్పాటు చేసిన పౌర సన్మాన సభలో ఆయన ప్రసంగించారు. మంత్రి పదవి కన్నా తన ప్రజలు తనకు ముఖ్యమని, మీలో ఒక్కరిగా మీ హృదయాల్లో శాశ్వత చోటు కోసం తాను పరితపిస్తున్నానన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం తాను ఇంకా ఎంతో చేయాల్సి ఉందని, ఆ తర్వాతనే తాను సన్మానం స్వీకరిస్తానని నిక్కచ్చిగా సెలవిచ్చారు. తాను ఎప్పడు మంచి కోరుకుంటూ ముందుకు వెళుతానని, అందరికి మంచి జరగాలనే తన ఆశ, తండ్రిగారి ఆశీస్సులు, అమ్మ దీవెన మూలంగానే తిరిగి మంథని ప్రజలు మరోసారి తనకు అవకాశం కల్పించారన్నారు. విద్యాశాఖ మంత్రిగా తనకు బాధ్యతలు అప్పగించిన తరువాత ఈ ప్రాంతానికి ఉన్నత విద్యా అవసరాలను ఏవిధంగా తీర్చాలనే విషయమై ఆలోచనలు చేశానన్నారు. ఈ ప్రాంతానికి అవసరమైన తన సేవలను ఏవిధంగా ఉపయోగించాలనే విషయంలో ప్రతి ఒక్కరు పార్టీలకు అతీతంగా తనకు సలహాలు, సూచనలు అందచేయవచ్చని అన్నారు. ఈ ప్రాంతంలో శ్రీధర్‌బాబుకు ఓటు వేయని వారు సైతం ప్రశ్చాతాపం చెందేవిధంగా తన పనితీరు ఉంటుందని అన్నారు. ఎన్నడూ దేనికి భయపడని నేను, ఈ ప్రాంత ప్రజలపై పూర్తి విశ్వాసంతో ఎన్నికల సమరాంగాన్ని ఎదుర్కొన్నానన్నారు. ఏ నిమిషంలోనైనా కించిత్తు అపజయం అనే ఆలోచన తనలో లేదంటే తనకు ఈ నియోజకవర్గ ప్రజలపై ఉన్న నమ్మకమేనన్నారు. ఈ ప్రాంతాన్ని సర్వతోముఖాభివృద్ధి చేసేందుకు తనకు పెద్దల నుండి ఆశీస్సులు, తమ పార్టీ నాయకులు, కార్యకర్తల నుండి ప్రోత్సాహం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పనకంటి చంద్రశేఖర్, చల్లా నారాయణరెడ్డి, కొత్త శ్రీనివాస్, ఎడ్ల సత్యనారాయణ, నర్సింగరావు, ఒడ్నాల శ్రీనివాస్‌తో పాటు పలువురు ప్రసంగించగా, పట్టణానికి చెందిన ప్రముఖులు, మేధావులు, కవులు, ఉపాధ్యాయులు వేలాదిగా పాల్గొన్నారు. మంథని ప్రజల తరపున సన్మాన పత్రాన్ని దుద్దిళ్ల గణపతి చదివి వినిపించి ఆయనకు అందచేశారు.

**కార్యకర్తలకే కండువాలు కప్పినమంత్రి:**శ్రీధర్‌బాబుకు సన్మానం చేసేందుకు పూలదండలు, శాలువాల తో వచ్చిన కార్యకర్తలు, నాయకులతో పాటు అభిమానులకే ఆయన సన్మానించడం వారిలో ఆనందాన్ని నింపింది. తనకు సన్మానం చేసుకునేందుకు ఇష్టం లేదని సున్నితంగా తిరస్కరిస్తూనే, వారు తెచ్చిన వాటిని వారికే ప్రేమ పూర్వకంగా అందచేశారు. చివరికి కొంత మంది కార్యకర్తలు ఆయనపై ఒత్తిడి తెచ్చి పూలదండలు వేశారు.

### జయ జయధ్వానాల మధ్య అమాత్యులకు స్వాగతం

ఉన్నత విద్యాశాఖ మాత్యులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు మంథని ప్రజలు సోమవారం అపూర్వ స్వాగత, సన్మానం నిర్వహించారు. మంథని మండలం పుట్టపాక గ్రామంలో మహిళలతో పాటు, కాంగ్రెస్ నాయకుడు కొత్త శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అక్కడి నుండి శ్రీరాంనగర్, లక్కేపూర్ క్రాసింగ్, కూచిరాజ్‌పల్లి, గంగాపురి నుండి పెట్రోల్‌బంక్ వద్దకు చేరుకున్నారు. హోరెత్తే కాంగ్రెస్ పాటలు, హుషారైన గీతాలతో నాయకులు, కార్యకర్తలు నృత్యాలు చేస్తూ తన అభిమాన నాయకున్ని ఆహ్వానించారు. ఆకాడ ప్రదర్శనలు, డోలు వాయిద్య నృత్యాల మధ్య నాయకులు సైతం ఉత్సాహాన్ని ఆపుకోలేక డ్యాన్సలు చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో ప్రజల మధ్య ఆయన అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. అనంతరం తన తండ్రి మాజీ స్పీకర్ దివంగత శ్రీపాదరావు విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. భారీ జనసందోహం మధ్య శ్రీపాదచౌక్‌లో ఏర్పాటు చేసిన సన్మాన సభ వేదిక వద్దకు జయ జయ ధ్వానాల మధ్య ఆయన చేరుకున్నారు.

## ఇదీ కథ!



అంటే ఇన్నాళ్ళూ చేసినవి 'అధికార ఉద్యమాలా' సార్?

## ఎస్ఆర్ఎస్‌పి డిఎస్ఇ ఇంటిపై

# ఎసిబి దాడి

**(మొదటిపేజీ తరువాయి)** విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఆర్ఎస్‌పి డివిసి సర్కిల్‌లో డిప్యూటి డిఎస్ఇగా పనిచేస్తున్న మహేష్ ఆదాయంకు మించి అస్తులు కలిగి ఉన్నాడనే అరోపణతో ఇంచార్జి డిఎస్‌పి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో దాడులు చేసేందుకు మహేష్ ఇంటికి వెళ్లగా ఇంటికి తాళం వేసి కుటుంబంతో సహా ఇతర ప్రాంతాలకు వెళ్లినట్లు తెలిసింది. తాళాలు వేసి ఉండటంతో ఎసిబి అధికారులు ఇంటిని సీజ్ చేసి ఇద్దరు ఎసిబి కానిస్టేబుళ్లను కాపలాగా ఉంచినట్లు సమాచారం. ఈ విషయమై ఎసిబి అధికారులను వివరణ కోరగా ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదు.



ఎస్ఆర్ఎస్‌పి డిఎస్ఇ మహేష్ గౌడ్ ఇంటి ముందు కాపలాగా ఉన్న ఎసిబి కానిస్టేబుళ్లు